మౌలిక సౌకర్యాలేవి?



జనప్రియనగర్‌లో బురదమయంగా మారిన మట్టిరోడ్డు



నివాసాల మధ్యలో పెరిగిన పిచ్చిమొక్కలు

- జనప్రియ నగర్‌లో అధ్వానంగా అంతర్గత రహదారులు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ రూరల్: నగర పరిధిలోని ముబారక్‌నగర్ 18 డివిజన్ జనప్రియనగర్‌లో మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతుల కల్పనలో ప్రజాప్రతినిధులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా రోడ్లు, అస్తవ్యస్తంగా డ్రెయినేజీలతో కాలనీలో పారిశుధ్యం లోపించిందని పలువురు పేర్కొంటున్నారు.

అవస్థలు పడుతున్న కాలనీవాసులు..

ముబారక్‌నగర్ ఆర్మూర్‌కు వెళ్లే రోడ్డు మాత్రం బీటీ రోడ్డుగా ఉంది. కానీ 18 డివిజన్‌లో మాత్రం అంతర్గత రోడ్లు మొరంతో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో మొరం రోడ్లపై చినుకు పడితే మాత్రం ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. వాహనాలు సైతం వర్షం పడితే కాలనీ నుంచి బయటకు రాని పరిస్థితి. ఇళ్ల చుట్టూ డ్రెయినేజీలు అపరిశుభ్రంగా ఉండటంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన మురికికాలువ

సమస్యలను పరిష్కరించాలి..

నగరంలోని 18 డివిజన్ పరిధిలో ఉన్న ప్రజలు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలి. కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించాలి.

– అశోక్, కాలనీవాసి

జీజీహెచ్‌లో సమస్యలను పరిష్కరించాలి

సుభాష్‌నగర్: నగరంలోని జీజీహెచ్(జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి)లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహాను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో మంత్రిని శనివారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కనీస మౌలిక సదుపాయాలు లేవని, వివిధ విభాగాల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, వైద్యులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి సరిపడా నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి దామోదర రాజనర్సింహాకు వినతిపత్రం అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

విద్యుత్ సరఫరాలో రక్షణ చర్యలు చేపట్టాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): విద్యుత్ సరఫరాలో సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టాలని, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మలు తొలగించాలని ట్రాన్స్‌కో డీఈ ఉత్తం జాడే తెలిపారు. మండలంలోని సిర్పూర్ నుంచి వెళ్తున్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు విరిగి, తీగలు తెగిపడే అవకాశముందని, వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పనిచేసే సమయంలో సిబ్బంది అందరూ సమన్వయంతో ఉంటే ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. ఇన్సులేటర్లు చెడిపోతే వెంటనే మార్చాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని పేర్కొన్నారు. ఏఈ బాబా శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ జగన్మోహన్‌చారి, శ్రీనివాస్, లైన్‌మెన్ ఫకీరా, సంతోష్, పీర్‌సింగ్, చందర్, మురళీ, సంతోష్, నరేష్, మహేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.



విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఈ

సంక్షిప్తం

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థిని బదావత్ మౌనిక జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ సుప్రజ శనివారం తెలిపారు. ఈనెల 11న సికింద్రాబాద్‌లో జరిగిన రగ్బీ రాష్ట్రస్థాయి పోటీల్లో మౌనిక ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. ఈనెల 19న పూణెలో జరిగే జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో మౌనిక పాల్గొంటుందన్నారు. విద్యార్థినిని ఎస్‌ఓ సుప్రజ, పీఈటీ నీరజ అభినందించారు.



సిరికొండ: జాతీయస్థాయి మేజర్ లీగ్ బేస్‌బాల్ ఇండియా–2024 పోటీలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బెంగళూరులో ఈనెల 19 నుంచి 23 వరకు జరిగే పోటీల్లో వారు పాల్గొననున్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో శనివారం ప్రిన్సిపాల్ నర్సయ్య అభినందించారు. ఉపాధ్యాయులు గంగారెడ్డి, పీఈటీలు అనిల్, సంతోష్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి ఎంపీడీవోకు అస్వస్థత

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి ఎంపీడీవో సతీష్‌కుమార్‌కు శనివారం మధ్యాహ్నం ఫిట్స్(మూర్చవ్యాధి) రావడంతో ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కార్యాలయ సిబ్బంది గమనించి వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్ రవీందర్ సతీష్‌కుమార్‌కు చికిత్స అందించారు. అనంతరం ఎంపీడీవో ఆరోగ్యం కాస్తా కుదుటపడగానే కార్యాలయ సిబ్బంది స్వస్థలమైన కామారెడ్డికి తీసుకువెళ్లారు.

బడిలో మొక్కలు నాటిన విద్యార్థులు



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని శంకర్‌భవన్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, టీచర్లు మొక్కలు నాటారు. ఎకో క్లబ్ యాక్టివిటీస్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఎన్జీసీ నందు గ్రూపులుగా విభజించి కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే విద్యార్థులు వారి ఇంటి వద్ద ఒక మొక్క నాటి ఆ మొక్కకు వారి తల్లి పేరు తర్వాత ఆ మొక్క పేరును పెట్టి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకున్నారు. హెచ్ఎం వాసుదేవరావు, జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, రాజయ్య, శైలేష్, గంగాధర్, క్రాంతి, భారతి, గోపి పాల్గొన్నారు.

ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు

కమ్మర్‌పల్లి: సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని ఆర్మూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రయివేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం బస్సు డ్రైవర్లు, యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బస్సు నడిపే ముందే తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన

రుద్రూర్: మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం, ఐకేపీ ఆవరణలో శనివారం కీటక జనిత వ్యాధులపై మలేరియా నోడల్ ఆఫీసర్ రాజేందర్ అవగాహన కల్పించారు. దోమల ద్వార వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్లు రవి, సుమతి పాల్గొన్నారు.

పోతంగల్ గ్రామంలో..

పోతంగల్ (రుద్రూర్): పాత పోతంగల్ గ్రామంలో శనివారం మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది లార్వా సర్వే చేశారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని ప్రజలకు సూచించారు.

ఆధ్యాత్మికం

27న లలితాదేవి ఆశ్రమాలయ వార్షికోత్సవం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో గల లలితాదేవి ఆశ్రమాలయం 21వ వార్షికోత్సవం ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఆశ్రమ ధర్మాధికారి వేలేటి రాజేందర్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా 27న గణపతిపూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, శ్రీలలితా మహాత్రిపుర సుందరీ దేవతా ప్రీత్యర్థం సాముహిక సుహాసినీలచేత లక్ష కుంకుమార్చన, పంచముఖ దుబ్బ రాజేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం, 12 జ్యోతిర్లింగాలకు 12 మంది దంపతులచే శ్రీరుద్రక్రమార్చన ఉంటుందన్నారు. 28న శుక్రవారం శ్రీలలితా మహాత్రిపుర సుందరీ దేవతా, సపరివార దేవతల మూల విగ్రహములకు మహా అభిషేకం, కుంకుమార్చన సహిత కోటి పుష్పార్చన, పంచసూక్త హవనం, రుద్రహోమం, పూర్ణాహుతి, మహానివేదనం, మహా అన్నప్రసాదం ఉంటుందన్నారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని తొండాకూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు, బాడిబాటలో అడ్మిషన్లను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. సీఎంవో శ్రీనివాసరావు, హెచ్ఎం లింగారెడ్డి ఉన్నారు.

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. అడ్మిషన్లు, మధ్యాహ్న భోజన నిర్వహణ, ఐఎఫ్‌పీఎస్‌ల నిర్వహణలపై సమీక్షించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. హెచ్ఎం మంజుల, మల్కన్న పాల్గొన్నారు.

ఉద్యోగాల సంఖ్యను పెంచాలి

ఆర్మూర్‌టౌన్: గ్రూప్–2, 3లో ఉద్యోగాల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు కావస్తున్నా గ్రూప్–2,3 పోస్టుల సంఖ్యను పెంచడంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇప్పటికైన పోస్టుల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు కోరారు.

నియామకం



నిజామాబాద్‌నాగారం: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షుడు జిల్కర్ విజయానంద్ లయన్స్ జోన్ చైర్మన్‌గా నియమితుల య్యారు. ఈమేరకు లయన్స్ జిల్లా గవర్నర్ నగేష్ పంపటి శనివారం విజయానంద్‌కు నియామకపత్రం అందజేశారు. విజయానంద్ ఇందూర్, కామారెడ్డి, కామారెడ్డి వివేకానంద, సదాశివనగర్ క్లబ్‌లకు జోన్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. నియామకంపై క్లబ్ ప్రతినిధులు కార్యదర్శి చింతల గంగాదాస్, మచ్చ రవీందర్, యాదగిరి, లక్ష్మినారాయణ, గురుప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు

పెద్దమ్మకు బోనాల సమర్పణ

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో ముదిరాజ్‌లు శనివారం పెద్దమ్మకు బో నాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. డప్పువాయిద్యాలు, భాజభజంత్రీలతో బోనాలను ఆలయం వరకు ఊరేగింపుగా వెల్లారు. గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు.

క్లుప్తంగా

సర్వేను సక్రమంగా నిర్వహించాలి



డిచ్‌పల్లి: మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మండలంలోని ధర్మారం(బి), బర్దిపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక ఇంటిలో ఎంత మంది ఉంటున్నారు, వారికి సరిపడేంత నీరు పంపిణీ అవుతాందా లేక ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలపై వివరాలు తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇంటి యజమాని ఆధార్ నెంబరు, ఫోటో తీసుకోవడంతో పాటు ఇతర వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ పనులను మండల సూపరింటెండెంట్, గ్రామ ప్రత్యేక అధికారి బ్రహ్మానందం, ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రవీణ్ శనివారం పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. పనుల వివరాలను కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.

తప్పలను సవరించాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖ విడుదల చేసిన ప్రమోషన్ల సీనియార్టీ జాబితాలలో తప్పులను సవరించాలని డీటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం వారు డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదుల ఆధారంగా వెంటనే సవరించాలన్నారు. తప్పులను సరి చేసి జాబితాను మళ్లీ ప్రకటించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ఓమజీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ



నిజామాబాద్‌నాగారం: ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు ఎండీ అబ్బాస్ పేర్కొన్నారు. నగరంలో శనివారం మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'పార్లమెంటు ఎన్నికలు–పరిశీలన' అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చాలని చూసినా ప్రజలు 240 సీట్లు మాత్రమే ఇచ్చి ముకుతాడు వేశారన్నారు. మరింత పట్టుదలతో నియంతృత్వ, మతోన్మాద పోకడలకు వ్యతిరేకంగా నిలబడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రామ్మోహన్‌రావు, హుస్సేన్, ఈవీఎల్ నారాయణ, చంద్రశేఖర్, రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'ఇస్కాన్'కు ప్రచార వాహనం అందజేత



సుభాష్‌నగర్/నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఇస్కాన్ కంటేశ్వర్ కేంద్రానికి శనివారం నగర మహేశ్వరి సేవాసమాజ్ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార రథాన్ని అందజేశారు. ఈ వాహనం ద్వారా నగర సంకీర్తన, ధర్మ ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఇస్కాన్ కేంద్ర నిర్వాహకుడు రామానంద ప్రభు పేర్కొన్నారు. మహేశ్వరి సమాజ్ ప్రతినిధులు రామ్‌స్వరూప్ డాలియా, పవన్ కేడియా, బాలకృష్ణ ఇనానీ, కమల్ కిషోర్ ఇనానీ, గిరిధారి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు అనిల్ కదం, ధాత్రిక రమేష్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..



హమాల్‌వాడిలోని మార్కెట్ షెడ్డులో నిలిపిన వాహనాలు

పార్కింగ్ స్థలంగా మారిన మార్కెట్ షెడ్డు

నగరంలోని హమాల్‌వాడి చౌరస్తాలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.లక్షల నిధులు ఖర్చు చేసి, వీధి వ్యాపారుల కోసం రేకుల షెడ్డు నిర్మించారు. ఆకర్షణీయంగా ఉండడానికి వివిధ రకాల కూరగాయల బొమ్మలతో ముస్తాబు చేశారు. కానీ వాటిలో కూరగాయల వ్యాపారులు ఉండకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో కాలనీవాసులు పార్కింగ్ షెడ్డుగా వాడుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపైన అమ్మే వ్యాపారులను షెడ్డులోకి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రిపేర్‌షెడ్ నిర్మాణ పనులు ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఖిల్లా ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో మున్సిపల్ వాహనాల మరమ్మతుల కోసం షెడ్ నిర్మాణానికి మేయర్ దండు నీతూ కిరణ్, మున్సిపల్ కమిషనర్ మకరందు శనివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ వాహనాల నిర్వహణ కోసం అవసరమైన చిన్న చిన్న రిపేర్లు చేయుటకు రూ.43లక్షల నిధులతో షెడ్ నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. రోజువారి చెత్త తరలింపు చేసే వాహనాలు, నీటి సరఫరా వాహనాలకు ఏదైనా రిపేర్లు వచ్చినట్లయితే షో రూమ్ లలో చేయించటం ద్వారా సమయం వృథా కావటమే కాకుండా నగరంలో చెత్త నిర్వహణపై ప్రభావం పడుతున్నందున ఈ షెడ్ నిర్మాణం చేస్తున్నామన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. కార్పొరేటర్ ఇల్లందుల మమత, మున్సిపల్ డిప్యూటి ఇంజనీర్ ఆనంద్ సాగర్, అసిస్టెంట్ ఇంజినీర్ ఇనాయత్ కరీం తదితరులు పాల్గొన్నారు.



రిపేర్‌షెడ్ పనులకు భూమిపూజ చేస్తున్న మేయర్ నీతూకిరణ్, కమిషనర్ మకరందు

బురదమయంగా రహదారి

సిరికొండ: మండలంలోని పాకాల నుంచి చీమన్‌పల్లికి వెళ్లే రోడ్డు శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. ఈ మార్గంలో తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికి అటవీశాఖ అభ్యంతరంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. నాలుగు కిలోమీటర్ల మేర కేవలం మట్టి రోడ్డు మాత్రమే ఉంది. దీంతో వర్షాకాలం వచ్చిందంటే మట్టి రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. వర్షాలకు మట్టి రోడ్డు బురదగా మారుతుండటంతో వాహనాలు దిగబడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



బురదలో దిగబడిన వాహనం

నియామక ఉత్తర్వులు ఇప్పించాలి

భీమ్‌గల్: 61ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకు వెంటనే నియామక ఉత్తర్వులు ఇప్పించాలని వీఆర్‌ఏల సంఘ సభ్యులు కోరారు. ఈమేరకు శనివారం వారు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయడంతోపాటు కారుణ్య నియామకాల కోసం జీవో నెంబర్ 81, 85 ప్రకారం 3797 మంది వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత ఉత్తర్వులు ఇప్పించాలని వారు కోరారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,800	వెండి (కిలో)	91,500
22 క్యారెట్స్	67,155		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	35	50	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	90
జీరకాయ	60	90	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	90	120	గోబిగడ్డ	20	40
కాకరకాయ	50	80	గోబిపువ్వు	25	50
వంకాయ	35	60	బీట్‌రూట్	20	40
పాలకూర	30	50	కరివేపాకు	50	80
మెంతికూర	70	100	చామగడ్డ	50	80
కొత్తిమీర	120	150	గోరుచిక్కుడు	80	100
పుదీనా	70	100	చిక్కుడుకాయ	60	120
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మనమే(తెలుగు)-10.50, 01.45, 4.40,7.35,10.30
స్క్రీన్-2	హరోంహర(తెలుగు)-1.40 ,7.30,10.30 నీ దారే నీ కథ(తెలుగు)- 4.45
స్క్రీన్-3	మహారాజా(తెలుగు)-10.40,4.45, 10.40 - ఇంద్రనీ(తెలుగు)-1.30 మ్యూజిక్ షాప్ మూర్తి(తెలుగు)-7.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	హరోంహర(తెలుగు)-10.45,7.25, 10.40 ఇన్‌సైడ్-2(3డీ ఇంగ్లీష్) -2.00 మహారాజా(తెలుగు)-4.20
స్క్రీన్-2	ఇన్‌సైడ్ అవుట్-2(3డీ ఇంగ్లీష్)-11.25 5.00 మనమే(తెలుగు)-1.45,7.20, 10.35
స్క్రీన్-3	మహారాజా(తెలుగు)-10.45 10.40 మ్యూజిక్‌షాప్ మూర్తి (తెలుగు)- 1.50 హరోంహర(తెలుగు)-4.40 నీ దారే నీ కథ(తెలుగు) -7.55
స్క్రీన్ -4	చందు చాంపియన్(హిందీ)-10.15,1.25,7.20,10.30 ముంజె (హిందీ)- 4.35
దేవి	మహారాజా (తెలుగు)
నటరాజ్	చందు చాంపియన్(హిందీ)
విజయ్	హరోంహర(తెలుగు)